ప్రజాశక్తి
ఆదివారం 21 ఏప్రిల్ 2024
I
అల్లూరి సీతారామరాజు

బురదమయంగా రహదారి

- ఇబ్బందిపడ్డ వాహనదారులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలో శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపుల శబ్దాలతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా అరకు- పాడేరు ప్రధాన రహదారి నారింజ వలసలో నిర్మిస్తున్న 516ఇ హైవే రోడ్డుపై ఉన్న మట్టి కూరుకు పోవడంతో బురద మయంగా మరింది. దీంతో, ఆ రోడ్డుపై వెళ్తున్న వాహనాలు జారి పోవడటంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

మట్టిలో కూరుకుపోయిన బస్‌లు

సజావుగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- ఎన్నికల వ్యయాలను కచ్చితంగా లెక్కించాలి - వ్యయ పరిశీలకులు పంకజ్ సింగ్

ప్రజాశక్తి-పాడేరు:ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు పంకజ్ సింగ్ సూచించారు. శనివారం కలెక్టరే మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల వ్యయ పరిశీలన, ఎస్ఎస్టి, వీడియోగ్రాఫర్స్, వీడియో విజువల్ బందాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ, ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల వ్యయాల వివరాలను ఖచ్చితత్వంతో లెక్కించాలని ఆదేశించారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి పైసా కూడా ఎన్నికల వ్యయంలోకే వస్తుందని, వాటిపై ఏఈఓలకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల వ్యయం లెక్కింపులో పనిచేసే బృందాల నుంచి ఎప్పటికపుడు వివరాలు సేకరించాలని, వాటిని సంబంధిత పట్టికల ద్వారా ఎన్నికల వ్యయ రిజిష్టరులో నమోదు చేయాలని సూచించారు. పెయిడ్ న్యూస్‌కు సంబంధించిన వ్యయ వివరాలను బి-16 ద్వారా ఎం.సీ.ఎం.సీ తెలియ జేస్తుందని, వాటిని కూడా వ్యయంలోకి లెక్కించాల్సి ఉంటుందన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరని, అనుమతి లేకుండా చేసే వాటిని కూడా పరిశీలించి ఎన్నికల వ్యయంలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. స్టార్ క్యాంపెయి నర్లతో ప్రచారం నిర్వహించే వ్యయాన్ని పార్టీ, అభ్యర్థి ఖాతాలకు సమానంగా చూపాలని తెలిపారు. పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాల ఉమ్మడి ప్రచారంలో పాల్గొనే అభ్యర్థుల వ్యయాలను కూడా సమానంగా నమోదు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో అభ్యర్థుల వ్యయాల లెక్కింపుకు సంబంధించి రిజిష్టర్లలో ఎప్పటికపుడు నమోదుచేసి, ఖర్చుల వివరాలను ఆయా వ్యయ పరిశీలకులకు అందజేయాలని తెలిపారు. ఈ విషయమై పలువురు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. అభ్యర్థుల, పార్టీల ఖర్చులకు సంబందించిన అంశాలపై 9381134602 /9381126301 నంబర్లకు ఫోన్ చేసి తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని వ్యయ పరిశీలకులు తెలిపారు. ఈ సమావేశంలో వ్యయ పరిశీలన నోడల్ అధికారి సువర్ణ ఫణి, ఎంసిఎంసి సభ్యులు పి.గోవింద రాజులు, పి. రాములు, సహాయ వ్యయ పరిశీలకులు, వివిటి, ఎస్ఎస్టి బృందాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పంకజ్ సింగ్

వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శనివారం భారీ వర్షం కురిసింది. గంటకు పైగా ఉరుములు గాలులతో భారీ వర్షం పడింది. ఇటీవల కొద్ది రోజులుగా మన్యంలో ఉష్ణోగ్రతల పెరిగి ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. పాడేరులో గత పది రోజులుగా ఎండ తీవ్రత బాగా పెరిగింది. ఈ సమయంలో భారీ వర్షం కురవడంతో పాడేరు మన్యమంతా ఆహ్లాద భరితంగా మారింది. మన్యంవాసులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగింది. వేసవిలో ఏప్రిల్, మే నెలలో మధ్యాహ్నం పూట పాడేరు ఏజెన్సీలో ఈదురు కాలులతో కూడిన భారీ వర్షాలు కురవడం పరిపాటి. ఏజెన్సీ అంతటా ఈ వేసవి వర్షాలు అక్కడక్కడ కురుస్తున్నాయి. వేసవి దుక్కులకు ఈ వర్షాలు ఉపకరిస్తాయని రైతులు చెబుతున్నారు.

జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

జి:మాడుగుల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా కాసింది. ఎండ వేడిమికి మండల వాసులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. మధ్యాహ్న సమయంలో భారీ వర్షం కురవడంతో ఎండ నుండి ప్రజలు ఉపశమనం పొందారు.

అనంతగిరి:మండలంలో ఒక్కసారిగా ఆశాశం మేఘావృతమై మెరుపులు, ఈదురు కాగాలతో కూడిన కుండ పోత వర్షం కురవడంతో మండలమంతా ఉపశమనం పొందారు. గత రెండు నెలలుగా ఎండతో పాటు వడగల్పులతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలు సుమారు రెండు గంటల సేపు ఏకదాటిగా కుండ పోత వాన కురవడతో సేద తీరారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వంతల రాజేశ్వరి

టిడిపి రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తా

మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గం నుండి టిడిపి రెబల్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గం టిడిపి అభ్యర్థిని ప్రకటించినప్పటి నుండి అసంతృప్తితో ఉన్న రాజేశ్వరి ఎట్టకేలకు శనివారం తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి తను పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. 2019 నుండి ఐదు సంవత్సరాల పాటు రంపచోడవరం నియోజకవర్గ ఇన్చార్జిగా పార్టీ ఆదేశాలను పాటించానని, పార్టీ పిలుపులను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అనంతబాబు తనపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసినా ఎదుర్కొని, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టినా వారికి మనోధైర్యాన్ని కలిగించి అతని నుండి పార్టీని కాపాడుకుంటూ వచ్చానని చెప్పారు. పోలవరం నిర్వాసిత ప్రాంతంలో పర్యటించి బాధితులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. రంపచోడవరం అభ్యర్థిగా తనను ప్రకటిస్తే గ్యారెంటీగా గెలిస్తానని, కాని అధిష్టానం తన కష్టాన్ని గుర్తించకుండా పార్టీలో సభ్యత్వం లేని కొత్త వ్యక్తికి సీటును కేటాయించడం దారుణమన్నారు. సీటు ప్రకటించిన తరువాత పలుమార్లు పార్టీ అధినేత చంద్రబాబును కలిసి తన కష్టాన్ని వివరించిన సీటు మార్చలేదని తెలిపారు. దీనితో నియోజకవర్గంలోని ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకుల అభిప్రాయం మేరకు టిడిపి రెబల్ అభ్యర్థిగా పోటీలో దిగాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. రెబల్ అభ్యర్థిగా విజయం సాధించి చంద్రబాబు వద్దకు వెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు

- ▶▶ కిలోమీటరు దూరంలోని చెలమ నీరే ఆధారం
- ▶▶ కలుషిత నీటితో ప్రబలుతున్న వ్యాధులు
- ▶▶ ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని అతిమారుమూల ప్రాంతమైన కుమడ పంచాయతీ చీపురుగొందిలో తాగునీటి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వీరు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు ప్రభుత్వాలు పట్టించుకోలేదు. చీపురుగొంది గ్రామంలో 48 కుటుంబాలు ఉండగా సుమారు 200 మంది జనాభా ఉంది. గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక సుమారు 1 కిలోమీటరు దూరంలో కొండకి ఆనుకొని ఉన్న చెలమ వద్దకు అతి కష్టం వెళ్లి నీటిని కావిళ్లతో మోసుకొని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.కొండ చెలమ నీరు కలుషితం కావడంతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు గొల్లూరి తిల్లి, కిల్లో మల్లేష్, గుంట సన్యాసిరావు, కె.జిన్ను, జి.వెంకటరావు, గుంట సుబ్బారావులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టిడిపి, వైసిపి పార్టీల నేతలు ఎన్నికల వేళలో ఓట్ల కోసమే వస్తున్నారు తప్ప గిరిజన ప్రజల సమస్యలను పరిష్కారం చేయ లేదన్నారు. ఏళ్ల తరబడి పాలకులు పరిపాలన చేసినప్పటికీ తాగునీరు సౌకర్యం కల్పించలేదన్నారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం సైతం తమ గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పనలో విఫలం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన ఎండాకాలంలో మంచినీరు దొరకడం గగనమైందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.

నీటిని తోడుతున్న మహిళ

కావిడతో నీటిని మోసుకొస్తున్న గిరిజనుడు

ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఏకలవ్య ప్రవేశ పరీక్షకు 388 మంది హాజరు

ప్రజాశక్తి -రాజవొమ్మంగి

ఏకలవ్య పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి శనివారం ఏపీ గురుకుల కళాశాలలో జరిగిన ప్రవేశ పరీక్షకు 388 మంది విద్యార్థులు హాజరయ్యారు. వివిధ మండలాలకు చెందిన 429 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 42 మంది హాజరు కాలేదని ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. 17 తరగతి గదుల్లో పరీక్షలు నిర్వహించామని, 17 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించారని చెప్పారు.

బోర్డును ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఉపాధి హామీ బోర్డులో పనుల వివరాలు నమోదు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని కురిడి పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనులపై పని ప్రదేశాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ బోర్డులో పనులకు సంబంధించిన వివరాలు నమోదు చేయకుండా తెల్ల సున్నం వేసి వదిలేశారు. దీనిపై ఈనెల 19న ప్రజాశక్తిలో ఉపాధి హామీ బోర్డులో పనుల వివరాలు ఏవి అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంపీడీవో ఆదేశాలతో ఉపాధి హామీ పథకం ఎపిఓ సూరిబాబు ఆ పంచాయతీ పుట్ట బంధ గ్రామంతో పాటు పలు గ్రామాల్లో పనులకు సంబంధించిన వివరాలను రాసి నమోదు చేశారు. కొన్ని కారణాలతో ఉపాధి కూలీలకు బిల్లులు కాక పోవడంతో వివరాలు నమోదులో కొంత ఆలస్యం జరిగినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణీని తరలిస్తున్న కుటుంబీకులు

డోలీ మోతతో గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మారుమూల గిరిజన గ్రామాల్లో సరైన రోడ్డు సౌకర్యం లేక గర్భిణీలకు ప్రసవ సమయంలో డోలి మోతలు కష్టాలు తప్పడం లేదు. మండలంలోని మారుమూల ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు కొల్లాపుట్టు పంచాయతీ బొడ్లమామిడి గ్రామానికి చెందిన పోట్టంగి సన్యాసమ్మ అనే గర్భిణి మహిళకు శనివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. ఆ గ్రామానికి నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో సుమారు మూడు కిలోమీటర్లు దూరం మోసుకుని తీసుకెళ్లి అక్కడి నుంచి అంబులెన్స్ లో అరకులో ఏరియా హాస్పిటల్‌కు గర్భిణీని తరలించారు. ఇటువంటి సంఘటనలు గిరిజన ప్రాంతంలో జరుగుతున్న ప్రభుత్వం, అధికారులు గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యం వహించడం విచారకరం. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామాలనికి చెందిన గిరిజనులు కోరారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి

గిరిజన గ్రామాల్లో విస్తృత ప్రచారం

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

కాంగ్రెస్, సిపిఐ, ఆప్ తదితర ఇండియా వేదిక పార్టీలు బలపరిచిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సలను గెలిపించాలని కోరుతూ గిరిజన గ్రామాల్లో శనివారం విస్తృతంగా ప్రచారం చేశారు.

దేవీపట్నం : సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ దేవీపట్నం మండలం ఇందుకూరు పంచాయతీ పరిధి రమణయపేట, కచ్చులూరు, కె.గొందురు గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలను కలిసి సిపిఎం అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రామకృష్ణ, సిపిఎం నాయకులు జి వెంకటరావు, సాయి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చింతూరు : సిపిఐ, ఆప్, కాంగ్రెస్ పార్టీలు బలపర్చిన సిపిఎం అభ్యర్థులు లోత రామారావు, పి.అప్పలనర్సలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఎం సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, వెంకట్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండలంలోని అల్లిగూడెం గ్రామంలో శనివారం గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో అల్లిగూడెం గ్రామస్తులు భీమయ్య, పోడియం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : సిపిఎం అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ శనివారం విఆర్.పురం మండలంలో గ్రామ గ్రామాన జీపు ద్వారా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోతా నామినేషన్‌కు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి రాక

రంపచోడవరం : 20న సిపిఎం అభ్యర్థి లోతా రామారావు నామినేషన్ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నాయకులు మధు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు హాజరుకానున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఎంపీ అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని...

సీలేరు : సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ జీకే.వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి నరమామిడి, కొంది గ్రామాల్లో శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం సభ్యులు పి.నాగేశ్వరరావు, పి.రాము, కే.బలరాం, రామకృష్ణ, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ : ఇండియా కూటమి బలపరిచిన అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పి.అప్పలనర్సకు ఓటేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని గుంటసీమ పంచాయతీలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, మాజీ సర్పంచ్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజనుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న సిపిఎం అభ్యర్థులను ఆదరించి చట్టసభలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి.డుంబు, తిలక్, రామ్ లాల్, అర్జున్, జాషువా, రామ్ లాల్ పాల్గొన్నారు.

చింతపల్లి : సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ కోరారు. మండల కేంద్రంలోని పరిసర ప్రాంతాల్లో సిపిఎం మండల కమిటీ సభ్యుడు సాగిన చిరంజీవితో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులను నిర్వీర్యం చేస్తున్నా యని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పాంగి జీవన్ కృష్ణ, సిపిఎం మండల కమిటీ సభ్యులు కిల్లో సింహాచలం, మజ్జి రాంబాబు పాల్గొన్నారు.

జి.మాడుగుల : మండలంలోని సులభం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు. సాగిన ధర్మన్న పడాల్, ఉపాధ్యక్షులు కోర్ర నాయుడు, సిపిఎం మండల నాయకులు పి.సంకయ్య .మాట్లాడుతూ, సిపిఎం ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపిస్తే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పి.సంకయ్య, వార్డు మెంబర్ రాము, గ్రామస్తులు పాల్గొన్నారు

జి.మాడుగుల మండలం సులభం పంచాయతీలో నినాదాలు చేస్తున్న గిరిజనులు

ఆహ్వాన పత్రికలు అందిస్తున్న సిపిఎం అభ్యర్థి లోతా రామారావు, నాయకులు

22న సిపిఎం అభ్యర్థి లోతా నామినేషన్‌కు తరలిరండి

విస్తృతంగా ఆహ్వాన పత్రికల పంపిణీ

రాజవొమ్మంగి : రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి లోతా రామారావు ఈనెల 22న సోమవారం నామినేషన్ వేస్తున్నారని, ఆ కార్యక్రమానికి కష్టజీవులంతా తరలిరావాలని కోరుతూ సిపిఎం నాయకులు శనివారం రాజవొమ్మంగిలో విస్తృతంగా ఆహ్వానపత్రికలు పంపిణీ చేశారు. అలాగే సిపిఎం అభ్యర్థి లోతా రామారావు ఆధ్వర్యాన ఆ పార్టీ నాయకులు శనివారం ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ఆదివాసీ, ప్రజా సంఘాల నాయకులకు ఆహ్వానపత్రికలు అందించారు. కార్యక్రమంలో చికిలింత సర్పంచ్ కొండ్ల సూరిబాబు, కొండపల్లి సర్పంచ్ జగన్నాథం, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు ఏవి నాగేశ్వరరావు, పి వీరబాబు, రామరాజు, భవన నిర్మాణ కార్మికులు సిహెచ్ రాంబాబు, ఎస్ వీరబాబు, టి శ్రీను, ఎం రమేష్, కె జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం : సిపిఎం అభ్యర్థి లోతా రామారావు నామినేషన్ కార్యక్రమానికి పార్టీ అభిమానులు, అభ్యుదయవాదులు, మేధావులు, ప్రజలు తరలిరావాలని సిపిఎం జిల్లా నాయకులు గొర్ల రామకృష్ణ, మండల నాయకులు శాంతిరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలో వివిధ గ్రామాలు పర్యటిస్తూ పెద్దలను, మేధావులను, పార్టీ అభిమానులను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం ఆంజనేయులు, దుర్గారావు, వెంకన్న, మల్లికార్జునరావు, నాగేంద్ర, గణేష్ పాల్గొన్నారు.

నివాసులకు స్థలం అలాట్మెంట్ చేయాలని వినతి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో పరిధిలో ఎప్పుడో తాత తండ్రులకు అలాట్మెంట్ చేసి ఉన్న స్థలాల్లో తాము నివాసం ఉంటున్నామని, ఆ స్థలాల్లో ప్రస్తుతం ఎవరైతే ఇల్లు కట్టుకొని నివాసముంటున్నారో వారి పేరున అలాట్మెంట్ చేయాలని ఏపీ జెన్కో విజయవాడ విద్యుత్ సౌద డైరెక్టర్ హెచ్ఆర్ సయ్యద్ రఫీకి వినతిపత్రం అందించినట్లు సీలేరు సర్పంచ్ దుర్గ, కాంగ్రెస్ నాయకులు కార్య శ్రీనివాస్ తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే విషయంలో స్థానిక అధికారులతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఏళ్ల తరబడి ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్న ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటే వాటిని మరమ్మతులు చేసుకోవటానికి, నూతనంగా నిర్మించుకోవడానికి జెన్కో అధికారులు ఆంక్షలు విధించడం, ఇబ్బందులు గురి చేయడం దారుణమన్నారు. తాము నివాసం ఉంటున్న స్థలాల్లో ఏ మరమ్మతులు చేసుకోవాలన్నా స్థానిక జన్కో అధికారుల చుట్టూ ప్రదక్షిణం చేయవలసిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడు ఎపిఎస్‌సి బోర్డుగా ఉన్నప్పుడు స్థలాలు కేటాయించారని, వాటికి పన్నులు కట్టుకొని నివాసముంటున్నామన్నారు. ప్రస్తుతం తమంటున్న ఇళ్ల స్థలాలు తమ పేరుపై అలాట్మెంట్ చేసి ఇళ్లు నిర్మించుకోవడానికి ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా చూడాలని కోరారు. ఈ సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారని ప్రజలకి ఎటువంటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వినతిపత్రం ఇస్తున్న సీలేరు సర్పంచ్ దుర్గ, కాంగ్రెస్ నేత శ్రీనివాస్

నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న పల్లాల లచ్చిరెడ్డి

న్యూ డెమోక్రసీ అభ్యర్థి నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అభ్యర్థి పల్లాల లచ్చిరెడ్డి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో రంపచోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్‌కు ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని లచ్చిరెడ్డి అందజేశారు. లచ్చిరెడి స్వగ్రామం రంపచోడవరం మండలం బూసిగూడెం పంచాయితీ కొత్త పాకలు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎ.జ్యోతికృష్ణ, తహశీల్దారు నాగరాజు, డిప్యూటీ తహశీల్దార్లు యన్‌వివి సత్యనారాయణ, బి.రాజు, శివ, రామకృష్ణ, చైతన్య, విశ్వనాథ్, సరిత, బాలాజీ, శ్రీధర్, రవీంద్రబాబు, వీరభద్రరావు, సత్యనారాయణ, సీనియర్ సహాయకులు లక్ష్మణరావు, పాలు బాబు, అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-అనంతగిరి: మూగజీవాలకు సోకే వ్యాధులకు అరికట్టేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు అనంతగిరి పశు వైద్య సంవర్ధకశాఖ వైద్యాధికారి సందీప్ తెలిపారు. మండలంలోని టోకూరు పంచాయతీ పరిధి ములియాగుడ, బగ్గమారవలస, తెతలిగూడ, సిచగుడ, కొండిభ పంచాయతీ మూవ్వంవలస, లింభగుడ గ్రామాల్లో పశువులు, మేకలకు గాలికుంటు వ్యాధుల నివారణకు టీకాలు వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీను, అనిల్, అప్పారావు, దిలీప్ పాల్గొన్నారు

కానరాని కనీస సౌకర్యాలు

అవస్థలు పడుతున్న సిబ్బంది

ఇదీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ దుస్థితి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో నిర్మించిన ఆయుష్మాన్ భారత్ వెల్నెస్ సెంటర్‌కు కనీస వసతులు లేక పోవడంతో సెంటర్లో పనిచేసే సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. ఈ కేంద్రాన్ని 12వ నెలలో ఎమ్మెల్యే గొల్ల బాబురావు ప్రారంభించారు. ఈ భవనానికి నేటికీ విద్యుత, నీటి సౌకర్యం లేవు. కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. వెల్నెస్ సెంటరులో మరుగుదొడ్ల నిర్మాణం లేకపోవడం విశేషం. ఈ సెంటర్లో వైద్య ఆరోగ్య సిబ్బంది దాదాపు 6మంది వరకు మహిళలు పని చేస్తున్నారు.నేటికీ కూడా కార్యాలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించ లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కార్యాలయానికి విద్యుత్ సౌకర్యం నీటి సౌకర్యం కల్పించాలని సిబ్బంది కోరుకుంటున్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లిలో క్రిష్ టౌన్షిప్‌లో పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత స్వగృహంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు కార్యకర్తల సమక్షంలో అనిత కేక్ కట్ చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో సందడి

థింసా నత్యం ప్రదర్శిస్తున్న గిరిజనులు

- ఆకట్టుకుంటున్న థింసా నృత్యాలు
- గిరి మహిళలు చందాల వసూలు
- మొదలైన ఇటుకల పండుగ

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: ఏజెన్సీ ప్రాంతంలో ఇటుకల పండగ ప్రారంభం కావడంతో ఎన్నికల సందడితో పాటు పండగ సందడి గ్రామాల్లో కనిపిస్తుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి సార్వత్రిక ఎన్నికలతో పాటు ఇటుకల పండగ కూడా జరుగుతుండటంతో ఒకపక్క గిరిజనులు పండగలో నిమగ్నమై ఉండగా వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు ప్రచారంలో ఉన్నారు. ఈ పండగను పురస్కరించుకుని గిరిజన గ్రామాల్లో గిరిజన సంప్రదాయ బద్ధంగా ఆదివాసి గిరి మహిళలు గ్రామాల్లోనీ ప్రధాన రోడ్లలో అడుగడుగున తాళ్లతో గేట్లను ఏర్పాటు చేసి, ఇంటింటికి తిరుగుతారు. గ్రామ పెద్ద మనుషులకు పసుపు బియ్యంతో బొట్టు పెట్టి దండలు వేసి పజోర్ (చందా) వసూళ్ళు చేస్తున్నారు. వచ్చిన చందా డబ్బులతో మహిళలంతా ఒకేచోట పిండి వంటలు చేసుకుని చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి పంచుకొని తినడం తోపాటు సాయంత్రం గ్రామస్తులంతా కలిసి దింసా నృత్యం ప్రదర్శిస్తూ సరదాగా గడుపుతున్నారు.

ఇదిలా ఉండగా మరోపక్క గ్రామాల్లో పోటీ చేస్తున్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని చేపడుతున్నారు. గ్రామాల్లో గిరి మహిళలు వారికి పసుపు బియ్యంతో బొట్టు పెట్టి ఘనంగా ఆహ్వానిస్తూ ఇటుకల పండగలో భాగస్వాములుగా చేస్తున్నారు. గ్రామస్తులతో కలిసి ప్రచారానికి వెళ్ళిన నాయకులు కూడా గిరిజన సాంప్రదాయమైన దింసా నృత్యాలను ప్రదర్శిస్తూ సరదాగా గడుపుతూ ప్రచారాలను చేసుకుంటున్నారు. నాయకులు పజోర్ (చందా) ఇస్తుండటంతో ఆదివాసీ గిరి మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా ఒకేసారి ఇటుకల పండగతో పాటు ఎన్నికలు జరుగుతుండడంతో గ్రామాలతో పాటు మండల కేంద్రాల్లో కూడా సందడి నెలకొంది.

జిల్లాలో నాలుగు నామినేషన్లు దాఖలు

అరకు -2, పాడేరు, రంపచోడవరంలో చెరొకటి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో మూడవరోజు శనివారం నాలుగు నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో అరకు అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి రెండు నామినేషన్లు పాడేరు, రంపచోడవరం స్టేట్మెంట్ల నుంచి ఒక్కొక్క నామినేషన్ వేశారు. శనివారం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. గొంద్యాన దండకారణ్య పార్టీ అభ్యర్థి చుంచు రాజాబాబు ఒక నామినేషన్ సమర్పించారు. స్వతంత్ర అభ్యర్థి గెమ్మిలి కృష్ణారావు ఒక నామపత్రాన్ని దాఖలు చేసారు. పాడేరు అసెంబ్లీ స్థానానికి ఇండియా ప్రజా బంధు పార్టీ తరఫున కింటు కూరి జోసెఫ్ నామినేషన్ వేశారు. రంపచోడవరం అసెంబ్లీ స్థానం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థి పల్లాల లచ్చిరెడ్డి నామినేషన్ వేశారు.

ఉత్సాహంగా జగన్ బస్ యాత్ర

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జగన్ బస్సు యాత్ర ఉత్సాహంగా కొనసాగింది.గొడిచెర్ల నైట్ స్టే పాయింట్ నుంచి శనివారం ఉదయం సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్ర ప్రారంభమైంది. సీఎం జగన్ మోహన్ రెడ్డి 9 గంటలకు బయలు దేరతారన్న సమాచారంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు గొడిచెర్ల, చినదొడ్డిగల్లు, నక్కపల్లి హైవే జంక్షన్ వద్దకు చేరుకున్నారు. 10.30 గంటలకు సీఎం జగన్ బస్సు యాత్ర ప్రారంభించారు. గొడిచెర్ల, ఉద్దండపురం, వేంపాడు, చినదొడ్డిగల్లు, కాగిత, నక్కపల్లి మీదుగా బస్సు యాత్ర సాగింది.గొడిచెర్ల, నక్కపల్లి హైవే జంక్షన్ల వద్ద అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి ముత్యాల నాయుడు, పాయకరావుపేట నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థి కంబాల జోగులు, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణలతో కలిసి జగన్ బస్సు యాత్రను కొనసాగించారు.

వాహనదారులకు తప్పని అవస్థలు

సీఎం జగన్ రాకతో పోలీసులు సుమారుగా గంట సేపు వాహనాలను నిలుపుదల చేశారు. దీంతో వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. గొడిచెర్ల వద్ద సీఎం నైట్ స్టే పాయింట్ ఏర్పాటు చేయడంతో రాకపోకలకు పోలీసులు ఆంక్షలు పెట్టడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.గొడిచెర్ల వద్ద సీఎం నైట్ స్టే పాయింట్ కు వెళ్లే మార్గంలో గోతులను మట్టితో పూడ్చారు. జగన్‌ను పాయకరావుపేట, యలమంచిలి, అనకాపల్లి, నర్సీపట్నం, మాడుగుల, చోడవరం నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసిపి నేతలు కలిశారు.

ఎస్.రాయవరం: మండలంలోని అడ్డురోడ్డులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బస్ యాత్రను చేపట్టారు. ప్రజలకు అభివాదం చేస్తూ యాత్రను కొనసాగించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపి అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు సిఎం వెంట ఉన్నారు.

తరలి వెళ్లిన వైసిపి శ్రేణులు..

కోటవురట్ల: సీఎం జగన్ మోహన్ రెడ్డి సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి వైసీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ప్రతి గ్రామం నుంచి బస్సులపై బయలుదేరి వెళ్లారు. మండల వైసీపీ అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, జిల్లా యువజన విభాగపు కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు పెద్ద సంఖ్యలో శ్రేణులను సభకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేస్తున్నారని తెలిపారు.

సిఎం సభకు ఆర్‌టిసి బస్సుల తరలింపుతో...

ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు

ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్: రాజయకీయ పార్టీల సభలకు ఆర్టీసీ బస్సులను ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు అన్నారు. నర్సీపట్నంలో శనివారం ఆయన మాట్లాడుతూ, శనివారం అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలలో ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి సభలకు ఆర్టీసీ బస్సులను మళ్లించారని, దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వేలాది మంది ప్రయాణికులు, చంటి పిల్లలు, వృద్ధులు, విద్యార్థులు మండుటెండలలో తీవ్ర అవస్థలు పడ్డారన్నారు. రాజకీయ పార్టీల సభలకు ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రజా రవాణా సంస్థకు ప్రజలు ప్రయాణం ముఖ్యమా! అదికార పార్టీ సభలు ముఖ్యమా? అని ప్రశ్నించారు. దీనిపై డ డిమాండ్ చేశారు. ఇక నుండి రాజయకీయ పార్టీల సభలకు ఆర్టీసీ బస్సులను ఇవ్వడాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

పండగకు ఆటంకాలు సరికాదు

- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నంలో మరిడీ మహాలక్ష్మీ అమ్మవారి పండగకు ఆటంకాలు సృష్టించడానికి ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ, 2022 సంవత్సరంలో మరిడమ్మ పండగకు ఎమ్మెల్యే ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. మరిడమ్మ నగల విషయంలో తాము ప్రవేశించేంత వరకు బయట పెట్టలేదని విమర్శించారు. ఆభరణాలు ఏమైనా తక్కువైతే మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణదే బాధ్యత అన్నారు.

నిబంధనల మేరకే కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మరిడి మహాలక్ష్మీ అమ్మవారి జాతరకు సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాల సమయాలను మార్పు చేస్తున్నామని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం ఆయన నర్సీపట్నంలో మాట్లాడుతూ ఈ నెల 22న పెద్ద జాగారం, 23న పండుగ నిర్వహిస్తున్నామన్నారు. రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి కార్యక్రమాలు చేయకూడదని నిబంధనలు ఉన్నాయన్నారు. దీంతో, రాత్రి 7 గంటల నుంచి 10 గంటల లోపే స్టేజీ ప్రోగ్రాం నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో గుల్లిపాడు శివారు జనకయ్యపేట చెందిన పలువురు టిడిపిలో చేరారు .నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్ నందు పాయకరావుపేట నియోజకవర్గం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత శనివారం పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు .

ఘనంగా శివపార్వతుల కల్యాణం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక (లక్ష్మణే శ్వరస్వామి దేవస్థానం) శివాలయంలో శివ, పార్వతుల కళ్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణతో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు మహేష్, వేద పండితులు భగవాన్ శర్మ, పండు శర్మ ల నేతృత్వంలో కల్యాణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు .

గ్రామాల్లో పైలా ప్రచారం

ప్రజాశక్తి -చీడికాడ: మండలంలోని బి.సింగవరం, లక్ష్మీనారాయణపురం గ్రామాలలో శుక్రవారం రాత్రి ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా టిడిపి-బిజెపి-జనసేన పార్టీల మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు, ఆయన సతీమణి శ్రీదేవి ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. గ్రామ టిడిపి అధ్యక్షుడు శరగడం శివ, పాల సంఘం అధ్యక్షుడు శరగడం రవి, నాయకులు దాడి సోమినాయుడు, దాడి కళ్యాణం, రాపేటి తరుణ్, చప్ప శ్రీను, శరగడం సత్తిబాబు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- చింతూరు

సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మండలంలోని కుయ్‌గురు, సింగనగూడెం గ్రామాల్లో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు తహశీల్దార్ యండి. నాజీముల్లాషా మాట్లాడుతూ రోజుకు రెండు గిరిజన గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులను ఓటు హక్కు గూర్చి చైతన్యపర్చుతున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, వృద్ధులను పోలింగ్ తీసుకువెళ్లడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగనగూడెం గ్రామస్తులను కలిసి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బొద్దుల దేవయ్య, వీఆర్వో సొడి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

52 మంది రోగులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని ముంజవరం గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.నాగార్జున 52 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వేసవిలో వడగాల్పులు గురికాకుండా అనారోగ్యంతో ఉన్న వారు, వృద్ధులు ఇళ్ల వద్దే ఉండాలని సూచించారు. పలువురికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఎస్ఆర్ షాపింగ్‌మాల్ పున: ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జగదాంబ జంక్షన్‌లో ఆధునికీకరించిన ఎస్ఆర్ షాపింగ్‌మాల్‌ను సినీహీరోయిన్ శివాత్మిక రాజశేఖర్ జ్యోతి ప్రజ్వళన చేసి శనివారం పున్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ రావడం ఆనందంగా ఉందన్నారు. ఇరవై ఏళ్ల వస్త్రవ్యాపారంలో అనుభవమున్న ఎస్ఆర్ షాపింగ్‌మాల్‌లో కొత్త కలెక్షన్స్‌ను ఆకర్షణీయమైన ఆఫర్లతో సరసమైన ధరలకు అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ డైరెక్టర్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో తమకు 14 బ్రాంచిలు ఉన్నాయని, జగదాంబ, గాజువాక, అనకాపల్లిలోని మాల్స్‌ను ఆధునికీకరించి, 'ఇప్పటి వరకు ఒక లెక్క, ఇక నుంచి మరో లెక్క' ట్యాగ్‌లైన్‌తో ముందుకు వెళ్తున్నారు. ప్రత్యేక ఆఫర్లు, ఛాలెంజింగ్ ధరలు మరో వారం రోజుల పాటు అమలులో వుంటాయన్నారు కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ రఘు, బ్రాంచ్ మేనేజర్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ధరిత్రి దినోత్సవాన్ని జయప్రదం చేయాలని గ్రీన్ క్లైమెట్ స్వచ్ఛందసంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. శనివారం ఎంవిపి కాలనీలోని ఎస్‌వివిపి డిగ్రీ కళాశాలలో, శివాజీపాలెం జివిఎంసి ప్రాదమిక పాఠశాల, కెడిపిఎం ఉన్నత పాఠశాలల్లో ఎపి కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ సంయుక్త ఆధ్వర్యాన ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవి.రత్నం మాట్లాడుతూ ఎకో వైజాగ్‌లో భాగంగా 'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్' అనే ఇతివృత్తంతో ఆదివారం ఉదయం 9 గంటలకు మాధవధారలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వివిపి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్, హెచ్‌ఎంలు దుర్గా కుమారి, సుమతీబాయి, గ్రీన్ క్లైమేట్ వాలంటీర్ రవితేజ, యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధి కృష్ణకుమారి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం అందిస్తున్న సమితి సభ్యులు

ప్రజాశక్తి రాజవొమ్మంగి : మండలంలోని అమీనాబాద్ పంచాయతీ ఎ.వనకరాయి గ్రామంలో అగ్ని ప్రమాద బాధితుడు సుంకర రామచంద్రరావు కుటుంబానికి జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి అధ్యక్షులు కారం సీతారామన్న దొర (ఢిల్లీ బాబు) సహాయం అందజేశారు. అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఇంటిని శనివారం ఆయన పరిశీలించారు బాధిత కుటుంబానికి వంట సామాగ్రి, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, దుస్తులు, దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్తు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో గిరిజననేతర పేదలకు ప్రభుత్వ పథకాలు, పక్కా ఇల్లు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోటం నానాజీ, పసల రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలం బోలగొండ గ్రామ పంచాయితీ చెరువూరు గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులు పల్లాల సోమిరెడ్డి కుటుంబాన్ని కారం సీతారామన్న దొర శనివారం పరామర్శించారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన సోమిరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సాయం అందివ్వాలని కోరారు. తమ సంఘం తరుపున వంట సామాగ్రి, నిత్యావసరాలు, బట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కారం సింహాచలం, కారం బాపిరాజు, కారం వెంకటరావు, సారపు ప్రతాప్ దొర, కారం చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి-రంపచోడవరం : అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపాల్ సంతోషి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు అగ్నిమాపక వారోత్సవాలు, వివిధ ప్రమాదాల సమయంలో ఆశాఖ చేస్తున్న సేవల గురించి వివరించారు. అగ్నిమాపక పరికరాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ జమాల్ బాషా, డిఐఓ సాధన, కస్తూరిబా విద్యలాయం విద్యార్థులు, ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది ఎస్.గంగన్న దొర పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మధురవాడలో ఫైర్‌స్టేషన్ అవసరం

మాట్లాడుతున్న ఆర్‌ఎఫ్ఒ నిరంజన్‌రెడ్డి

అగ్నిప్రమాదాల నివారణపై సివిల్ ఫైర్‌ఫైటర్స్‌కు శిక్షణ

వారోత్సవాల ముగింపులో ఆర్‌ఎఫ్ఒ నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భౌగోళికంగా, జనాభాపరంగా విస్తరించిన విశాఖ నగరంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించి అగ్ని ప్రమాద స్థలాలకు సకాలంలో చేరుకోవడం, మంటలను అదుపుచేయడం ఫైర్‌సిబ్బందికి కత్తిమీద సాములా మారిందని, ఈ నేపథ్యంలో మధురవాడ ప్రాంతంలో మరొక ఫైర్ స్టేషన్ ఏర్పాటు అవసరం ఉందని ఆర్ఎఫ్ఒ డి.నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం.అగ్నిమాపక ారోత్సవాల ముగింపు సందర్భంగా సూర్యాబాగ్ ఫైర్ స్టేషన్‌లో వివిధ వ్యాపార సంస్థలు, షాపింగ్ మాల్స్, హోటల్స్ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఎటువంటి ఫైర్ ఎక్విప్మెంట్ లేకుండా అగ్నిప్రమాదాలను అరికట్టడం, నివారించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సివిల్ ఫైర్ ఫైటర్స్‌కు మూడు రోజులపాటు శిక్షణనిచ్చి, సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా, ప్రమాదస్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోపే, ఆస్థి, ప్రాణనష్టాన్ని వీలైనంత వరకు తగ్గించి, మంటలను అదుపు చేయడంపై వీరికి తర్ఫీదునిస్తామన్నారు. సమావేశంలో డిఎఫ్ఒ ఎస్.రేణుకయ్య, ఎడిఎఫ్ఒలు పి. సింహాచలం, ఎన్. గోపి పాల్గొన్నారు..

ఇంటర్ ర్యాంకర్‌కు అభినందన

ఆరుద్ర మయూఖ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రమా ఆచంట

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇంటర్ ఫలితాల్లో హెచ్ఇసి గ్రూపులో 929 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకర్‌గా నిలిచిన ఆరుద్ర మయూఖ్ భాగవతులను శనివారం బివికె కళాశాలలో ప్రిన్సిపల్ రమా ఆచంట, కళాశాల య్యం, ఆర్ట్స్ విభాగం అధ్యాపకులు రత్నశేఖర్, భరత్, ప్రియా పట్నాయక్, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రమా ఆచంట మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభతో కాలేజీకి, తల్లిదండ్రులకు ఆరుద్ర మయూఖ్ పేరు తెచ్చారని కొనియాడారు.

ఆరుద్ర మయూఖ్ భాగవతుల స్పందిస్తూ ఐఎఎస్ కావాలన్నదే తన లక్ష్యమని, విశాఖ వ్యాలీ స్కూల్‌లో టెన్త్, బివికె కాలేజీలో ఇంటర్ పరీక్షలను మంచి మార్కులతో పాసయ్యానన్నారు. ఉపాధ్యాయులైన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందన్నారు.

ఈ ఏడాది వేసవి సీజన్‌లో రికార్డు స్థాయిలో ప్రత్యేక అదనపు రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణీకుల సౌకర్యార్థం ఈ ఏడాది వేసవి కాలంలో భారతీయ రైల్వేలు రికార్డు స్థాయిలో 9111 ట్రిప్పులను నడుపుతోందని రైల్వేశాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి శనివారం ప్రకటనలో తెలిపారు. గతేడాదితో పొలిస్తే 2742 ట్రిప్పులు అదనంగా నడుపుతున్నామన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో 52 వేసవి ప్రత్యేక రైళ్లతో పాటు 12జతల అదనపు రైళ్లను నడపడానికి సన్నద్ధమైందన్నారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా రైళ్ల సంఖ్య , ట్రిప్పుల సంఖ్యను పెంచుతామన్నారు.

ఇదిలావుండగా అన్ని రైల్వే స్టేషన్లలో తాగునీటి లభ్యత ఉండేలా చర్యలు చేపట్టాలని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఆదేశించారు. అన్ని ప్రధాన ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో విస్తృతమైన ప్రయాణికుల రద్దీ నియంత్రణ, పర్యవేక్షణకు సీనియర్ అధికారులను ఆయా స్టేషన్లలో అందుబాటులో ఉంచామన్నారు. ప్రయాణీకులకు రియల్ టైమ్ సాయం చేసేందుకు నైపుణ్యత కలిగిన ఆర్‌పిఎఫ్ సిబ్బంది నిర్వహణలో సిసి టివి కంట్రోల్ రూమ్ఏర్పాటు చేశామన్నారు.

పోషకాహారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ.: రోజువారీ ఆహారంలో పోషక విలువలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి సూచించారు. శనివారం బీచ్ రోడ్‌లోని ఓ హోటల్‌లో 'ఆరోగ్యం-ఆహారం'పై అవగాహన సదస్సులో మాట్లాడుతూ సీజను మారే వేళ రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండటానికి ఆరోగ్యకరమైన, సమతుల ఆహారంపై దృష్టి పెట్టాలని సూచించారు. రోజువారీ ఆహారంలో బాదం, వెల్లుల్లి, సీజనల్ పండ్లు, ఆకుకూరలు వంటి సహజమైన ఆహార పదార్థాలను జోడించడం ద్వారా అదనపు శక్తి లభిస్తుందన్నారు. విటమిన్ సి పుష్కలంగా ఉన్న నారింజ, నిమ్మ, ముసాంబి,ద్రాక్షపండు వంటి సిట్రస్ పండ్లను తీసుకోవాలన్నారు.

జాతరలో బాలల హక్కుల రక్షణకు చర్యలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈనెల 22నుంచి ప్రారంభమయ్యే కరకచెట్టు పోలమాంబ వార్షికజాతరలో భాగంగా 23న ప్రధానపండుగలో తల్లిదండ్రులతో కలిసి పెద్దసంఖ్యలో పిల్లలు పాల్గొనే అవకాశం ఉందని, వారి రక్షణకు తగు చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. ఈ మేరకు దేవస్థానం అధికారులకు,జిల్లా ఉన్నతాధికారులకు శనివారం ఆదేశాలు జారీచేశారు. క్యూలైన్లు, చంటి పిల్లలకు పాలు పెట్టేందుకు ప్రత్యేక క్యాబిన్లు, వికలాంగ బాలలకు సులభతర దర్శన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ మేరకు అన్ని శాఖల సమన్వయంతో తగు చర్యలు చేపట్టాలని సీతారాం కోరారు.